క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నగర పరిధిలోని కొత్తపేట, ఆర్అండ్బీ బంగ్లా, నవులూరు రోడ్, పాత బస్టాండ్ సెంటర్, నిడమర్రు రైల్వే గేటు వరకు మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో జరుగుతున్న అంతరాయానికి వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుగ్గిరాల మండల పరిధిలో 10వ తరగతి పరీక్షలకు 709 మంది హాజరయ్యారని, ఐదుగురు గైర్హాజరయ్యారని వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని వెల్లడించారు. తనిఖీల్లో ఈమని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్, డీఓ కోటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

1998 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్లకు న్యాయం చేయాలి

మంగళగిరి: 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్లకు న్యాయం చేయాలని ఏపీ డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. నగరంలోని ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత జూన్ 17వ తేదీన సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకున్న 6,852 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించిన ప్రభుత్వం 4,072 మందికి మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన వారికీ న్యాయం చేయాలని కోరారు.

ఏడో తరగతి విద్యార్థి అదృశ్యం



మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని ఇస్లాంపేట రెండో లైనుకు చెందిన ఏడో తరగతి విద్యార్థి అదృశ్యమైన ఘటన సోమవారం జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇస్లాంపేటకు చెందిన అహ్మద్ అలీ బ్యాంకు కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థి సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టు పక్కల విచారణ చేశారు. బాలుని ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు కనిపించడం లేదంటూ పట్టణ పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంటి వెలుగు పేదలకు వరం

రాయపూడి (తాడికొండ): కంటి వెలుగు పథకంతో పేదల జీవితాల్లో ప్రభుత్వం సంతోషాలు కురిపిస్తోందని నేత్ర వైద్యులు వి.సాంబశివరావు చెప్పారు. సోమవారం తుళ్లూరు మండలం రాయపూడి గ్రామంలో కంటి వెలుగు పథకం ద్వారా 60 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. 20 మందిని కళ్ళజోళ్ళ కోసం సిఫార్సు చేశారు. 40 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి కుర్చీల బహూకరణ

భట్టిప్రోలు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వాసవీ క్లబ్ జిల్లా ఇన్‌చార్జ్ విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు (బీఎస్సార్) సోమవారం 6 కుర్చీలను అందజేశారు. కుర్చీలను అందించేందుకు ముందుకు వచ్చిన శ్రీనివాసరావు సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, వాసవీక్లబ్, సత్యసాయి బాబా ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఐలవరం విద్యార్థులు

ఐలవరం(భట్టిప్రోలు): మండల పరిధిలోని ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం వియత్నాంలోని హోచీమింగ్ సిటీలో జరిగిన ఇంటర్నేషనల్ కానెన్ఫరెన్స్‌కు వర్చువల్‌గా హాజరయ్యారు. సుమారు 8 దేశాలు పాల్గొన్న ఈ కాన్ఫరెన్స్‌కు భారతదేశం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం ఐలవరం విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా ఐలవరం విద్యార్థులు ఏపీలోని నూతన విద్యా సంస్కరణలు, తమ పాఠశాలలో అవలంబిస్తున్న వినూత్న కార్యక్రమాలను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమానికి మలేషియా, సింగపూర్, ఫిలిప్పీన్స్, కంబోడియా, జపాన్, సౌత్‌కొరియా, శ్రీలంక దేశాలు వారి విద్యా రంగంలో వస్తున్న మార్పులను గూర్చి వివరించారు. వియత్నాం దేశంలోని విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి 500ల మందికి పైగా విద్యా శాఖాధికారులు హాజరయ్యారు. ఐలవరం విద్యార్థులు రూపొందించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చాలా మందిని ఆకర్షించడమే కాక ఆసక్తిని కలిగించింది. ఈ కార్యక్రమాన్ని ఐలవరం హైస్కూల్ ఆంగ్లోపాధ్యాయులు పచ్చారు హరికృష్ణ మిగిలిన దేశాల ఉపాధ్యాయులు పాల్గొని వారి దేశాలలో విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులను వివరించారు.

జన నినాదం.. జగనన్నే మా భవిష్యత్

- ఉత్సాహంగా మా నమ్మకం నువ్వే జగన్
- ఇంటింటికీ వైఎస్సార్ సీపీ నాయకులు
- ఘనస్వాగతం పలుకుతున్న ప్రజలు



యర్రబాలెంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు



మంగళగిరి మండలంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ తదితరులు



మంగళగిరి కొత్తపేట ఒకటో వార్డులో..



తాడేపల్లి రూరల్ మండలం పెనుమాకలో..

మంగళగిరి/తాడేపల్లి రూరల్/ఫిరంగిపురం: మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ప్రజల నుంచి నాయకులకు అపూర్వ ఆదరణ లభిస్తోంది. మంగళగిరి నగర పరిధిలోని నవులూరు, నిడమర్రు, పెదవడ్లపూడి గ్రామాల్లో సోమవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రజల నుంచి స్వచ్ఛందంగా మద్దతు లభిస్తోందన్నారు. ఏ ఇంటికి వెళ్లినా జై జగన్ నినాదం వినిపిస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో పెన్షన్ అందుకోవాలన్నా లబ్ధిదారులు లంచాలు ఇచ్చుకుని కార్యాలయాల చుట్టూ ఏళ్ల తరబడి తిరగాల్సిన దుస్థితి ఉండేదని, జన్మభూమి కమిటీ సభ్యులతో పాటు టీడీపీ నాయకుల అవినీతికి అంతే ఉండేది కాదని ధ్వజమెత్తారు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అర్హులైతే చాలు వలంటీర్లే ఇంటికి వచ్చి లబ్ధిదారులకు పథకాలను అందిస్తున్నారని, అందుకే ప్రజలంతా సంతోషంగా ఉన్నారని వివరించారు. ప్రజలు జగనన్న పాలనను మనసారా కోరుకుంటున్నారని స్పష్టమవుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, నాయకులు ఈపూరి ఆదాం, వేమూరి వందనం, గాదె శేషిరెడ్డి, జంగా నాగిరెడ్డి, శివరామిరెడ్డి, సుబ్బారావు, ఇంద్రసేనా రెడ్డి, పాలేటి కృష్ణవేణితో పాటు ఆయా వార్డుల పార్టీ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు. అదే విధంగా నగర పరిధిలోని కాజ, మంగళగిరిలోని శిబిరంతోపాటు 5,15,16,27 వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వార్డు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి జగనన్నకు అండగా నిలవాలని కోరారు.

- నగర పరిధిలోని యర్రబాలెంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. కొత్తపేటలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో నాయకులు గుండాల శ్రీనివాసరావు, పలగాని కోటేశ్వరరావు, దానబోయిన నాగయ్య, వ్యాసం అజయ్, రేమినిశెట్టి గోపి, పఠాన్ భాషా, మేరుగ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- జేసీఎస్ తాడేపల్లి మండల కన్వీనర్ మున్నంగి వివేకానంద రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటం, పెనుమాక ప్రాంతాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటంలో జరిగిన కార్యక్రమంలో లచ్చి వెంకటేశ్వరరావు, హరిబాబు గౌడ్, గాజుల లక్ష్మీనారాయణ, ప్రవీణ్ గౌడ్, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెనుమాకలో జరిగిన కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ దామేశ్వర రెడ్డి, సొసైటీ మాజీ ప్రెసిడెంట్ శివారెడ్డి,బొక్కా నాని, భుజంగరావు, షేక్ బషీర్, అన్నూరు సుబ్బారావు, భవనం రవీంద్ర రెడ్డి, బొక్కా అనూరాధ తదితరులు పాల్గొన్నారు.
- ఫిరంగిపురం జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరెఐమ్మ , జేసీఎస్ మండల కన్వీనర్ పి.మరియబాబు ఆధ్వర్యంలో శాంతిపేటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. నాయకులు కె.చిన్నప్పరెడ్డి, పి.జోసఫ్, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మయ్య, ఎస్.నాగరాజు, హేమలత, రంజన్‌బాబు, టి.డేవిడ్, కె.రామారావు, ఇజ్రాయిల్, టి.సాగర్ పాల్గొన్నారు.



మంగళగిరి మండలం కాజలో..



తాడేపల్లి రూరల్ మండలం ఇప్పటంలో..



ఫిరంగిపురంలో..

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత



చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేస్తున్న పార్టీ నాయకులు

మంగళగిరి: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సహకారంతో నగరంలోని చిరు వ్యాపారులకు సోమవారం తోపుడు బండ్లు అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. చిరు వ్యాపారులు ఊదర ప్రశాంతి, రావూరి వెంకటేశ్వరమ్మ, నాగ వెంకట శివ, సుభానీలకు పార్టీ నాయకులు ఎమ్మెల్యే ఆర్కే సొంత నిధులతో సమకూర్చిన తోపుడు బండ్లు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, పార్టీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు సంకె సునీత, పార్టీ నాయకులు ఎండీ ఫిరోజ్, దొడ్డక కృష్ణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి తాపం.. రోడ్లు నిర్మానుష్యం



నిర్మానుష్యంగా గౌతమబుద్ధా రోడ్డు

మంగళగిరి: వేసవి తాపం ప్రజలను బెంబేలెత్తిస్తోంది. ఉదయం 9 గంటల నుంచే విపరీతమైన ఎండ కాస్తోంది. ఫలితంగా 11 గంటల నుంచే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చే వారు దాహార్తితో అల్లాడుతున్నారు. వీరికోసం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 40కిపైగా చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. జ్యూస్ పాయింట్లు, కూల్ డ్రింక్స్ దుకాణాలు, సోడా బండ్ల వద్ద తాకిడి కనిపిస్తోంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నీరు అధికంగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

అభివృద్ధి పనుల నాణ్యత పరిశీలన



తాడేపల్లి 2వ వార్డులో జరిగిన అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ బోర్డు సిబ్బంది

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 130 కోట్ల రూపాయలు కేటాయించడంతో పలుచోట్ల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎప్పటికప్పుడు కార్పొరేషన్ అధికారులు పనుల నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ అధికారులతో తనిఖీలు చేయిస్తున్నారు. సోమవారం 2వ వార్డులో సుమారు రూ.40 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనుల నాణ్యతను క్వాలిటీ బోర్డు అధికారులు పరిశీలించారు. డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ క్వాలిటీ కంట్రోల్ అధికారుల దగ్గర నుంచి నివేదిక వచ్చిన తరువాత మాత్రమే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు.

ఇప్పటంలో తాగునీటి సరఫరా



ఇప్పటంలో కార్పొరేషన్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్ : ఇప్పటంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా కార్పొరేషన్ అధికారులు గతంలో ఉన్న పాత తాగునీటి పైపులైన్లు తొలగించారు. ఆ ప్రాంతంలో తాగునీటికి ఇబ్బంది రాకుండా కార్పొరేషన్ అధికారులు సోమవారం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా పాత పైపులైన్లు తొలగించి, వాటిస్థానంలో రోడ్డు మార్జిన్‌లో కొత్త పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. మరో నాలుగు రోజులపాటు ఇప్పటంలోని ప్రతి ప్రాంతానికి మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు.

పేరకలపూడి–నూతక్కి రహదారి విస్తరణ



రోడ్డు విస్తరణ నిమిత్తం తోలిన గ్రావెల్

తాడేపల్లిరూరల్ : నూతక్కి నుంచి దుగ్గిరాల మండలం పేరకలపూడి గ్రామాన్ని కలుపుతూ ఉన్న రహదారి విస్తరణ పనులను సోమవారం కార్పొరేషన్ అధికారులు ప్రారంభించారు. గతంలో మూడు మీటర్లు ఉండే డొంకరోడ్డును ఏడు మీటర్లు వెడల్పు చేసి పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ రహదారిలో నూతక్కి పొలాల్లో పండిన వాణిజ్యపంటలతోపాటు దుగ్గిరాల మండల పరిధిలోని పేరకలపూడిలో పండిన పంటలను విజయవాడ మార్కెట్‌కు తరలించేందుకు ఉపయోగిస్తుంటారు. నూతక్కి–పేరకలపూడి గ్రామాలకు చెందిన రైతులు ఎమ్మెల్యే ఆర్కేకు చిన్నడొంక వల్ల రవాణా ఇబ్బందిగా ఉందని చెప్పారు. వెంటనే ఎమ్మెల్యే ఆర్కే దుగ్గిరాల మండల సర్వేయర్లతోనూ, ఎంటీఎంసీ అధికారులతో సర్వే చేయించి ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. కొన్నిచోట్ల పంటపొలాలు ఉండడంతో ఎంటీఎంసీ అధికారులు రైతులతో చర్చించి కావల్సినంత వరకు భూమిని రైతుల వద్ద నుంచి అధికారికంగా తీసుకుని రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ రహదారి పూర్తయితే పలు గ్రామాల నుంచి విజయవాడ, మంగళగిరికి పంట ఉత్పత్తులను తరలించేందుకు అనువుగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. డొంకరోడ్ల నిర్మాణంపై ఎమ్మెల్యే చేస్తున్న కృషిని రైతులు అభినందించారు. గ్రావెల్ రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే కార్పొరేషన్‌ను దుగ్గిరాల మండలాన్ని కలుపుతూ 2.2 కి.మీ. మేర సుమారు రూ.2.5 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

క్లారినెట్ విద్వాంసుడు శ్రీనివాస్‌కు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం బంగారు మనిషి చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం కథానాయకుడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం క్లారినెట్ విద్వాంసుడు కోడూరు శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐతగోని గోపి, తురకారపు లక్ష్మీనారాయణ, కర్నాటి లక్ష్మయ్య, భీమనపల్లి సత్యం, కాటం సాంబయ్య, కాటం రవికుమార్, సోమవరపు సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, పినపాటి రవీంద్ర, ముళ్లపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇవ్వని హామీలూ నెరవేర్చిన జగనన్న

- వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త సురేష్‌కుమార్
- ఫణిదరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం



తాడికొండ మండలం ఫణిదరం గ్రామంలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలూ నెరవేర్చి పేదల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ చెప్పారు. సోమవారం తాడికొండ మండలం ఫణిదరం గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రతి గడపా పొందిన లబ్ధి గురించి వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సురేష్ కుమార్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఓటమి అనంతరం పత్తా లేకుండా పోయిన టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ కరోనా సమయంలోనూ రాష్ట్రం వైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. ఇప్పుడు ఓట్ల కోసం మళ్లీ వస్తున్నారని, వారికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. క్లిష్ట సమయంలోనూ ఆర్థిక లోటు ఉన్నా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ఆపలేదని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలూ నెరవేరుస్తున్నారని స్పష్టం చేశారు. ఫలితంగా ప్రజలంతా ప్రభుత్వంపై సంతృప్తిగా ఉన్నారని సురేష్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. గడప గడపలో లభిస్తున్న ఆదరణే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో జగనన్న ఇళ్ళ నిర్మాణాలపై ఆరా తీసిన సురేష్‌కుమార్ నిర్మాణాల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్మినేని రామచంద్రరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, భీమవరపు బ్రహ్మారెడ్డి, ముఖ్య నాయకులు తాళ్ళ శివ నాగరాజు యాదవ్, పసుపులేటి వెంకట్రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు నక్కా రత్తయ్య, సచివాలయ కన్వీనర్‌లు తిరుపతి వెంకయ్య, సుశీల్ రావు, మాదుగుల దాసు, గండికోట చంద్రయ్య పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

తెనాలి రూరల్: ప్రైవేటు వైద్యశాలలో సిబ్బందిపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు వైద్యులు పోలీసుల్ని కోరారు. పట్టణ పాత ప్రభుత్వ వైద్యశాల సమీపంలోని ఓ వైద్యశాలకు అపస్మారకస్థితిలో ఉన్న ఓ పాపను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి తీసుకువచ్చారు. వైద్యం సరిగా చేయడంలేదని డ్యూటీలో ఉన్న డాక్టర్‌తో పాటు సిబ్బందిపై దౌర్జన్యం చేసి దాడి చేశారు. దీనికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కోటినాగయ్య, వైద్యులు టూ టౌన్ సీఐ ఎస్. వెంకట్రావును సోమవారం కలసి దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేశారు.

రూపేష్ మక్వానాకు ఘన స్వాగతం



రూపేష్ మక్వానాకు అభినందనలు తెలియజేస్తున్న ఏబీవీపీ నేతలు

గుంటూరు ఎడ్యుకేషన్: రన్ ఫర్ సేవ్ యూత్–సేవ్ నేషన్ నినాదంతో 95 రోజుల్లో ఆరువేల కిలోమీటర్ల పరుగు చేపట్టిన గుజరాత్ వాసి రూపేష్ మక్వానా సోమవారం గుంటూరు నగరానికి వచ్చారు. మిర్చి యార్డు రోడ్డులోని ఓ హోటల్లో సోమవారం సాయంత్రం రూపేష్ మక్వానాను కలిసిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) గుంటూరు నగర శాఖ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డి. సాయిచరణ్ గుప్తా మాట్లాడుతూ ఢిల్లీ నుంచి ప్రారంభించిన పరుగు తిరిగి ఢిల్లీకి చేరుకునే లక్ష్యంతో రోజుకు 70 కిలోమీటర్లకు పైగా రూపేష్ మక్వానా పయనిస్తూ మార్గంమధ్యంలో గుంటూరుకు వచ్చారని చెప్పారు. ఆగిన చోటల్లా గ్రామాలు, నగరాల్లోని కళాశాలల్లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతరాన్ని చైతన్య పర్చేందుకు ప్రయత్నిస్తూ, తలచుకుంటే ఏదైనా సాధించగలరనే నమ్మకాన్ని వారిలో కలిగించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. యువతను ఉత్తేజపరచి, వారిలోని నైపుణ్యాల్ని వెలికితీయాలనే ఉద్దేశంతో తన విలువైన సమయాన్ని కేటాయించడం అభినందనీయమన్నారు. యువతరం రూపేష్ మక్వానా వంటి వ్యక్తుల్ని ఆదర్శంగా తీసుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు.

వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన



వెల్లటూరు(భట్టిప్రోలు): మండల పరిధిలోని వెల్లటూరు శ్మశానవాటికకు చేరుకునేందుకు రూ. 10 లక్షల వ్యయంతో వంతెన నిర్మాణ పనులను సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ శ్మశానవాటికకు చేరుకోవాలంటే నానాయాతనలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఐతే పడరాని తిప్పలు పడాల్సి వచ్చేది. దళితవాడ వాసుల చిరకాల కోరికను తీర్చేందుకు సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ముందుకు వచ్చారు. ఇందుకు రూ. 10 లక్షల గ్రాంట్‌ను మంజూరు చేయించారు. వంతెన నిర్మాణ పనులకు పాస్టర్లు సీహెచ్ స్టీవెన్‌సన్, డేవిడ్ జె. జోసఫ్, ఫరీద్‌లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు మేరుగ చలంబాబు, దాసరి రామారావు, చీకటి కోటేశ్వరరావు, దాసరి రామారావు, డొక్కా రామారావు, సున్నం ఆనంద్, పంచాయతీ రాజ్ ఏఈ కె. శేతు రామచంద్రరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కె. అనిల్ పాల్గొన్నారు.